క్లుప్తంగా

అణువణువులో వ్యాపించిన శ్రీకృష్ణుడు



శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు చేస్తున్న సుందర శ్రీనివాస్‌దాస్ ప్రభూజీ

అయినవిల్లి: అనంతకోటి బ్రహ్మాండంలో అణువణువు శ్రీకృష్ణుడే వ్యాపించి ఉన్నాడని, శ్రీకృష్ణుడు జపం చేసిన, ఆయన సేవలు ఉన్న వారిని ఎల్లవేళలా కాపాడుతూ ఉంటారని అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిర్ నిర్వాహకుడు సుందర శ్రీనివాస్‌దాస్ ప్రభూజీ అన్నారు. ఆదివారం నల్లచెరువులో అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిరంలో ఈ కృష్ణునికి విశేష అభిషేకాలు, పూజలు జరిపారు. సుందర శ్రీనివాస్‌దాస్ ప్రభూజీ మాట్లాడుతూ హరే కృష్ణ మంత్రం జపించిన వారికి అనుక్షణం ప్రశాంత వాతావరణం ఉంటుందన్నారు. శ్రీకృష్ణుడు ప్రసాదించిన జ్ఞానంతో సంతోషంతో సు ఖజీవనం సాగించవచ్చన్నారు. స్వామివారి లీలా మృతం వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు.

అగ్నిప్రమాద బాధితులకు చేయూత



చింతనలంక అగ్నిప్రమాద బాధితులకు చేయూతనందిస్తున్న మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు

అయినవిల్లి: మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఎంఈఎఫ్ ఆధ్వర్యంలో అయినవిల్లి మండలం చింతనలంక అగ్నిప్రమాద బాధితులకు ఆదివారం చేయూతనందించారు. జిల్లా అధ్యక్షుడు ఉందుర్తి వీరవెంకట్రావు ఆధ్వర్యంలో అగ్నిప్రమాదంలో సర్వం కాలిపోయి బూడిదై రోడ్డున ఆరు కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.పది వేలు, ఒక్క దుప్పటి అందజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కండెల్లి సురేష్‌బాబు, రాష్ట్ర కార్యదర్శి సుబ్బారా వు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు తాతపూడి వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షుడు ఈతకోట వీవీ సత్యనారాయణ, నాయకులు లంకకొండద శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

అయినవిల్లిలో కాలభైరవాష్టమి పూజలు



ముక్తేశ్వరంలో కాలభైరవస్వామిని పుష్పాలు, గారెల దండలతో విశేషంగా అలంకరించిన అర్చకులు

అయినవిల్లి: అయినవిల్లి, ముక్తేశ్వరం గ్రామాల్లో కొలువైన విఘ్నేశ్వరస్వామి, ముక్తి కాంత సమేత క్షణముక్తేశ్వరస్వామివారి ఆలయాల్లో కొలువైన కాలభైరవస్వామికి ఆదివారం అష్టమి పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సత్తిబాబుశర్మ, అయినవిల్లి నాగబాబు, శివరామకృష్ణ, అల్లవరపు సూరిబాబు ఆధ్వర్యంలో వేద పండితుల పర్యవేక్షణలో స్వామికి విశేష అభిషేకాలు, పూజలు జరిపారు. స్వామిని వివిధ పుష్పాలతోను, గారెలతోను ప్రత్యేకించి అలంకరించారు. ముక్తేశ్వరంలో ఈ పూజలు వీరవల్లిపాలెం ముద్రగెడ నాగయ్య సత్రం ఆధ్వర్యంలో ఆయన వంశీకులు ఈ పూజలు దగ్గరుంచి నిర్వహించారు. స్వామికి మారేడు దళాలతో ప్రత్యేక పూజలు జరిపారు. పెద్దఎత్తున భక్తులు పాల్గొని స్వామివారి పూజలను తిలకించారు. స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి నిత్యాన్నదాన ట్రస్టుకు రాజోలుకు చెందిన చెల్లింగి భానుమూర్తి, లక్ష్మీప్రసన్న దంపతులు ఆదివారం రూ.16,509 విరాళంగా అందించారు. వారికి ఆలయ అర్చకులు స్వామి వారి వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ ఉద్యోగులు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. నిత్యాన్నదానం అందించిన భక్తులను ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు, ఆలయ ఉద్యోగులు అభినందించారు.



దాత కుటుంబానికి స్వామి చిత్రపటం అందజేస్తున్న ఉద్యోగులు

శిథిలస్థితిలో పురాతన భవనాలు

- బ్రిటిషర్ల హయాంలో నిర్మాణం
- వర్షం వస్తే విధులకు అంతరాయమే
- క్రిమికీటకాల సంచారంతో ఆందోళన
- నూతన భవనాలకు నిధుల లేమి



శిథిలావస్థకు చేరిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పైభాగాన కప్పిన బరకం



ఆలమూరులో బ్రిటిష్ హయాంలో నిర్మించిన మద్రాసు టెర్రాస్ భవనం

ఆలమూరు: బ్రిటిష్ కాలంలో పరిపాలన సౌలభ్యం కోసం నిర్మించిన పురాతన కట్టడాలు శిథిలస్థితికి చేరుకుంటున్నాయి. భవనాలు నిర్మించి శతాబ్దం పూర్తవుతున్నా ప్రభుత్వాలు రక్షణ చర్యలు చేపట్టక పోవడంతో వాటి ఉనికి ప్రశ్నార్థకమవుతుంది. జిల్లాలో పలు పట్టణాలతో పాటు ఆలమూరులో కూడా 1890 దశకంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు విధులను నిర్వహించే విధంగా ముందు భాగం పెంకులతోనూ, వెనుక భాగం మద్రాసు టెర్రాస్ శ్లాబ్‌తోను నిర్మించారు. పది అడుగుల ఎత్తైన తలుపులు, విశాలమైన కిటికీలతో పాటు వెలుతురు సరిగా ఉండేందుకు పైభాగంలో వెంటిలేటర్లతో చూడముచ్చటగా ఉండే ఈ భవనం కళావిహీనంగా మారింది. ప్రస్తుతం తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు పనిచేస్తున్నాయి. పుష్కర కాలం నుంచి శ్లాబ్ వేసిన గదుల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం చిన్నపాటి వర్షానికే చిత్తడిగా మారుతుంది. కోట్లాది రూపాయల ఆదాయం లభిస్తున్నా అభివృద్ధికి నోచుకోకపోవడం స్థానికుల్లో అసంతృప్తిని రగుల్చుతుంది. గతంలో అనేకసార్లు తాత్కాలిక మరమ్మతులు చేయించినా పెద్దగా ఫలితం ఇవ్వలేదు. దీంతో అధికారులు ఎప్పటి కప్పుడు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుని తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయానికి సంబంధించి బంగాళా పెంకులపై ఐరన్ రేకులను వేసి తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టారు. అయినా భారీ వర్షాల సమయంలో గదుల్లోకి నీరు చేరుతుంది. గత వైభవానికి నిదర్శనమైన బ్రిటిష్ భవనానికి రక్షణ చర్యలు తీసుకోవడంతో అధికారులు వైఫల్యం చెందడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతుంది.

నూతన భవనాల్లోకి పలు ప్రభుత్వ కార్యాలయాలు

బ్రిటిష్ భవనంలో ఇప్పటి వరకూ తహసీల్దార్, సబ్ ట్రెజరీ, సబ్ రిజిస్ట్రార్, పోలీసు స్టేషన్, మీ సేవా కేంద్రాలు ఉన్నాయి. గత పదేళ్లలో పోలీసు స్టేషన్, సబ్ ట్రెజరీ కార్యాలయాలు నిర్మించిన నూతన భవనాలకు తరలివెళ్లాయి. మీసేవ కేంద్రం మూసివేయడం జరిగింది. బ్రిటిష్ కాలం నాటి భవనం భారీ ఎత్తులో ఉండటం వల్ల మరమ్మతులు చేసేందుకు వీలుపడటం లేదని తెలుస్తోంది. రూ.కోట్లలో ఆదాయం వచ్చే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఇటీవల మరమ్మతులు చేసినా ఇంకా ప్రయోజనం లేకుండా పోయింది. వర్షాకాలంలో తరచూ వర్షపు నీరు పడటం వల్ల రికార్డుల భద్రత కరువైంది. మండలంలో సుమారు 70 వేల జనాభాకు సేవలు అందిస్తున్న తహసీల్దార్ భవనం శిథిలావస్థకు చేరినా ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తుంది. సాయంకాలం అయితే చాలు దోమలతో సహవాసం చేయాల్సి వస్తుందని, తద్వారా అంటువ్యాధులకు గురవుతున్నామని రెవెన్యూ సిబ్బంది వాపోతున్నారు.

భవన ప్రాభవాన్ని కాపాడాలి

జిల్లాలోనే ప్రత్యేకత సంతరించుకున్న స్థానిక ప్రభుత్వ భవనాల సముదాయాన్ని పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు. దీంతో పాటు బ్రిటిష్ కాలం నాటి భవనం స్థానే అధునాతక సౌకర్యాలతో కూడిన భవనాన్ని నిర్మించి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాల భవన సముదాయంలో చిన్నపాటి వర్షానికే ఆ ప్రాంతమంతా చిత్తడిగా మారుతుంది. వర్షపు నీరు బయటకు వెళ్లేందుకు సరైన డ్రైనేజీ సౌకర్యం లేక ఆ ప్రాంగణంలో వర్షపు నీరు రోజుల తరబడి నిల్వ ఉండిపోతుంది.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

పి.గన్నవరం: ముంగండ గ్రామంలోని మంత్రవాది ఇందిరాకుమారి స్మారక గ్రామీణ వైద్యాలయంలో మంగళవారం ఉదయం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు హోమియో వైద్యుడు ఖండవిల్లి నాగేశ్వరరావు తెలిపారు. వేమగిరికి చెందిన పరమ హంస యోగానంద కంటి ఆస్పత్రి వైద్య సిబ్బంది ఉచితంగా కంటి పరీక్షలు చేస్తారని ఆయన వివరించారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తారన్నారు. పరిసర ప్రాంతాల ప్రజలు ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

అంబాజీపేట: భూ సమస్యల పరిష్కారానికి ఈ నెల 10 నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ జె.వెంకటేశ్వరి తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేయనున్నామన్నారు. ఈ నెల 6న జరగాల్సిన రెవెన్యూ సదస్సులు ఎన్నికల కోడ్ కారణంగా నిలిపివేశామన్నారు. 10న ఇరుసుమండ, 11న పుల్లేటికుర్రు, 12న కె.పెదపూడి, 13న గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం, 17, 18న మాచవరం, 19న ఇసుకపూడి, 20న చిరతపూడి, 21న నందంపూడి, 24న తొండవరం, వాకలగరువు, 26న పసుపల్లి, 27న ముక్కామల, 28న వక్కలంక, 31న మొసలపల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరుగుతాయన్నారు. భూమి విషయంలో అభ్యంతరాలు, తేడాలు ఉంటే సభలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని గ్రామాల్లో ఉన్న రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కొత్తపేటలో..

కొత్తపేట: మండలంలో ఈ నెల 10 (మంగళవారం) నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ వై.రాంబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10న వానపల్లి, వానపల్లి ఖండ్రిగ గ్రామాల్లో, 11న వాడపాలెం, 12న మందపల్లి, 13న గంటి, 17న అవిడి ఖండ్రిగ, 18న మోడేకుర్రు, 19న పలివెల, 20న అవిడి, 21న బిళ్లకుర్రు, 28న కొత్తపేట గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరుగుతాయని తెలిపారు. ఈ సదస్సుల ద్వారా భూ సమస్యలు, సెక్షన్-22(ఏ) కేసులు, సర్వే సమస్యలు, దేవదాయ ధర్మదాయ భూ వివాదాలు తదితర సమస్యలు దరఖాస్తులు చేస్తే వాటిపై విచారణ చేసి నిర్ణీత గడువు లోపు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రాంబాబు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయాలి



హైందవ శంఖారావం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న భక్తులు

అంబాజీపేట: వచ్చే ఏడాది జనవరి 5న చలో విజయవాడలో నిర్వహించే హైందవ శంఖారావ కార్యక్రమానికి హిందువులంతా పాల్గొని విజయవంతం చేయాలని ఆర్‌ఎస్ఎస్ ప్రచారక్ పి.విద్యాసాగర్ పిలుపునిచ్చారు. కముజువారిలంక శివారు శ్రీరామపురంలో వీహెచ్‌పీ ధర్మప్రచారక్ సమావేశాన్ని ధర్మప్రచారక్ కడలి వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం జరిగింది. విద్యాసాగర్ మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణ హైందవ సంప్రదాయాలను, ఆలయాల రక్షణ ఆవశ్యకతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. అనంతరం హైందవ సంప్రదాయాలను భక్తులకు వివరించారు. అనంతరం చలో విజయవాడ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో వాసంశెట్టి పల్లంశెట్టి, గుబ్బల సత్యనారాయణ, బొక్కా రామకృష్ణ, కముజు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత పఠనంలో దీక్షితకు ప్రథమ స్థానం



మండపేటలో సర్టిఫికెట్ అందుకుంటున్న దీక్షిత

కొత్తపేట: భగవద్గీత పఠనం పోటీలో కొత్తపేటకు చెందిన మునుకోటి దీక్షిత ప్రథమ స్థానం సాధించింది. టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం శాఖ ఆధ్వర్యంలో గీతా జయంతి సందర్భంగా ఆదివారం మండపేట జేసీ డిగ్రీ కళాశాలలో భగవద్గీత పఠనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి అనేకమంది పాల్గొన్నారు. వారిలో మునుకోటి సురేష్-వరలక్ష్మి దంపతుల కుమార్తె దీక్షిత జూనియర్స్ విభాగంలో ఆరో అధ్యాయంలోని శ్లోకాలను పఠించి ప్రథమ స్థానంలో నిలిచింది. నిర్వాహకులు సర్టిఫికెట్ అందజేశారు. ఇప్పటివరకూ 12 అధ్యాయాలను పూర్తి చేసింది. ప్రథమ స్థానం సాధించిన దీక్షితను, ఆమె తల్లిదండ్రులను, గురువు భార్గవిని ప్రియదర్శిని కరస్పాండెంట్ అద్దంకి బుద్ధచంద్రదేవ్ అభినందించారు.

ఘనంగా కొమ్ముల వారి ఆత్మీయ సమ్మేళనం



చిన్నారులతో కలసి నృత్యం చేస్తున్న కొమ్ముల కుటుంబానికి చెందిన వైద్యులు

మామిడికుదురు: క్షణం తీరిక లేకుండా ఎప్పుడూ బిజీబిజీగా ఉండే ప్రముఖులు తమ వయస్సును సైతం లెక్క చేయకుండా చిన్నారులతో కలసి నృత్యాలు చేశారు. తమ చిన్న నాటి మధుర స్మృతులను మననం చేసుకుని మురిసిపోయారు. ఉన్నత స్థానంలో ఉన్న ప్రముఖులు సన్మానాలు అందుకున్నారు. పెదపట్నంలంకలో ఆదివారం మన మండువా ప్రాంగణంలో ×కొమ్ముల వారి ఆత్మీయ సమ్మేళనం¤ ఆద్యంతం ఉల్లాసంగా, ఉత్సాహంగా సాగింది. ఈ సమ్మేళనంలో సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు కుటుంబ సభ్యుల మధ్య అనురాగం, ఆప్యాయతలను పంచుకున్నారు. నేటి తరానికి కుటుంబ విలువలను తెలియజేయాలన్న ప్రధాన ఉద్దేశమే ఈ సమ్మేళనం ప్రధాన లక్ష్యమని కొమ్ముల కుటుంబానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకురాలు జక్కంపూడి విజయలక్ష్మి పేర్కొన్నారు. కొమ్ముల కుటుంబానికి చెందిన ప్రముఖ వైద్యుడు శ్రీమన్నారాయణ, అనంతలక్ష్మి, ధ్వనంతరినాయుడు, రమణకుమార్, సునీత, అచ్యుతశివరామదాసు, కురుణాంబిక, మనోహర్‌నాయుడు, శ్రీవిద్యలను ఘనంగా సత్కరించారు. వారికి జ్ఞాపికలు అందజేశారు. తాము ఎంతో కష్టపడి చదువుకుని ఉన్నత స్థితికి చేరామని, నేటి తరం కూడా ఇదే విధంగా క్రమశిక్షణతో ఒక లక్ష్యం ఏర్పాటు చేసుకుని ఆ దిశగా ముందుకు సాగాలని ఉద్బోధించారు.

దోమల ఉధృతి... వ్యాధుల వ్యాప్తి



అంబాజీపేటలో ప్రధాన రహదారి పక్కనే పేరుకుపోయిన చెత్త

అంబాజీపేట: వాతావరణంలో మార్పులు, ఈ ఏడాది అధిక వర్షాలు కురవడం తదితర కారణాల వల్ల అంబాజీపేట మండలంలో పలు గ్రామాల్లో దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. సాయంత్రం ఐదు గంటలు దాటితే చాలు బయటకు వచ్చి ప్రజలపై వాటి ప్రతాపాన్ని చూపిస్తున్నాయి. అక్కడ, ఇక్కడ అనే తేడా లేకుండా ఎక్కడ పడితే అక్కడ, అన్ని ప్రాంతాల్లో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. సాధారణంగా వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండి, భూమి తడిబారి ఎక్కువ రోజులు తేమ కారణంగా ఎక్కడికక్కడ దోమలు వృద్ధి చెందేవి. మిగిలిన కాలాల్లో డ్రైనేజీలు, మురుగు పారని ప్రాంతాల్లో దోమల సమస్య ఎక్కువగా ఉండేది. అయితే కొన్ని రోజులుగా అన్ని ప్రాంతాల్లో అన్ని సీజన్లలో దోమలు బెడద ఎక్కువైందని గ్రామాల్లో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యతో అనేక మంది వివిధ రోగాల బారిన పడుతున్నారు. మలేరియా, బోద, డెంగీ, చికున్ గున్యా, మెదడువాపు తదితర వ్యాధుల వ్యాప్తి గ్రామాల్లో అధికంగా ఉంది. అంబాజీపేట మండలంలో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాల కారణంగా ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోవడం, డ్రైనేజీలో మురుగునీరు పారకపోవడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. మాచవరం, పుల్లేటికుర్రు తదితర గ్రామాల్లో రోడ్ల వెంబడి చెత్త పేరుకుపోతున్నా వాటిని తొలగించడంలో పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం వహించడం వల్లే దోమలకు నిలయంగా మారిందని పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్ల వెంబడి పేరుకుపోయిన చెత్తను, డ్రైనేజీల్లోని చెత్త, చెదారాన్ని తొలగించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆలమూరు మండంలోని పంచాయతీ కార్యదర్శులు

గ్రామం	కార్యదర్శులు	ఫోన్ నంబర్లు
ఆలమూరు	కె.మోక్షాంజలి (గ్రేడ్-1)	98487 75186
సంధిపూడి	ఎస్.వీర్రాజు (గ్రేడ్-1)	83748 47330
పినపళ్ల	ఎస్.వీర్రాజు (గ్రేడ్-1)	83748 47330
పెదపళ్ల	వి.వేణి (గ్రేడ్-1)	98668 22036
చింతలూరు	వి.వేణి (గ్రేడ్-1)	98668 22036
సూర్యారావుపేట	కె.హరేరామ్‌రెడ్డి	94928 31392
కలవచర్ల	వి.వేణి (గ్రేడ్-1)	98668 22036
పెనికేరు	జె.అయ్యన్న	93948 45937
నవాబుపేట	ఎస్.రాబాబు	63034 87949
నర్శిపూడి	కె.కృష్ణ	94949 04849
చొప్పెల్ల	ఎం.వెంకటరెడ్డి (గ్రేడ్-1)	99519 32244
బడుగువానిలంక	ఎం.వెంకటరెడ్డి (గ్రేడ్-1)	99519 32244
జొన్నాడ	సీహెచ్.సుభాష్	83418 16561
చెముడులంక	సీహెచ్.సుభాష్	83418 16561
మూలస్థాన అగ్రహారం	చిక్కాల వీరమాత	84065 66729
మడికి	బి.వెంకటరత్నం (గ్రేడ్-1)	99485 88418
మోదుకూరు	కె.సాయి ప్రసాద్ (గ్రేడ్-1)	94413 91824
గుమ్మిలేరు	కె.సాయి ప్రసాద్ (గ్రేడ్-1)	94413 91824

ఆలమూరు మండలంలోని వీఆర్వోల నంబర్లు

గ్రామం పేరు	రెవెన్యూ అధికారులు పేర్లు	ఫోన్ నంబర్లు
ఆలమూరు-1	జి.సత్యప్రసాద్	80083 25767
ఆలమూరు-2	సీహెచ్ భారతి	99088 02042
సంధిపూడి	టి.రమేష్	96187 96775
పినపళ్ల (ఇన్‌చార్జ్)	బి.ఉదయ్‌కుమార్	94942 27127
పెదపళ్ల	బి.ఉదయ్‌కుమార్	94942 27127
చింతలూరు	కె.రాజశేఖర్	99498 43666
సూర్యారావుపేట (ఆలమూరు-3)	పి.సుజాత	85000 02047
పెనికేరు	టి.రాంబాబు	97044 68600
కలవచర్ల (పెనికేరు-2)	కె.స్వామినాయుడు	79817 99743
నర్శిపూడి	బి.యేసేపు	94944 97838
బడుగువానిలంక	ఎన్.సిద్ధార్థ్‌కుమార్	99121 22128
జొన్నాడ-1	టి.రామకృష్ణ	79898 30831
జొన్నాడ-2 (ఇన్‌చార్జ్)	టి.రామకృష్ణ	79898 30831
చెముడులంక-1	టి.సూర్యప్రకాష్	90006 76439
చెముడులంక-2	జి.నాగజ్యోతి	86883 05406
మూలస్థాన అగ్రహారం-1	ఎ.శ్రీనివాసరావు	98489 05599
మూలస్థాన అగ్రహారం-2	సీహెచ్ రవికుమార్	94908 43559
మడికి-1	ఎన్.కొండలరావు	97043 35183
మడికి-2	డి.సుదర్శన్‌రావు	75692 47225
మడికి-3	ఎన్.వెంకట్రావు	99493 40789
మోదుకూరు	కట్టా ప్రసాద్	99519 13332
గుమ్మిలేరు	ఎస్.వినాయకుడు	99899 17532
చొప్పెల్ల-1 (ఇన్‌చార్జ్)	బి.ఉదయ్‌కుమార్	94942 27127
చొప్పెల్ల-2 (నవాబుపేట)	జి.రామకృష్ణ	98499 75041

పెదపట్నం మధ్యలంకలో పర్యాటకుల సందడి



పెదపట్నం మధ్య లంకలో సందడి చేసిన పర్యాటకులు

మామిడికుదురు: వైనతేయ గోదావరి నది మధ్యలంకలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. ఆటలు ఆడి, పాటలు పాడి అలరించారు. వివిధ వ్యాపకాల్లో నిత్యం బిజీగా ఉండే వివిధ వర్గాలకు చెందిన ప్రముఖులు విహారయాత్రలో సందడి చేశారు. మహిళలు నృత్యాలు చేశారు. చిన్నారులతో పాటు పెద్దలు టగ్ ఆఫ్ వార్, మ్యూజికల్ చైర్స్ ఆడారు. ఈ కార్యక్రమం ఆద్యంతం ఆహ్లాదకరంగా సాగింది. ప్రముఖ యోగా గురువు కేతన్ ఆకులతో పాటు పలువురు ప్రముఖులు ఈ విహార యాత్రలో పాల్గొన్నారు.

ఆలమూరులోని ప్రధాన బ్యాంకులు, కార్యాలయాలు

కార్యాలయం/బ్యాంకు పేరు	గ్రామం	ఎస్‌టీడీ కోడ్	ఫోన్ నంబర్
పోలీసు స్టేషన్	(ఆలమూరు)	08855	278433
సబ్ రిజిస్ట్రార్	(ఆలమూరు)	08855	278235
సబ్ ట్రెజరీ	(ఆలమూరు)	08855	278418
వ్యవసాయ మార్కెట్ కమిటీ	(ఆలమూరు)	08855	278298
యాక్సిస్ బ్యాంక్	(ఆలమూరు)	08855	279433
యూనియన్ బ్యాంక్	(ఆలమూరు)	08855	278448
ఇండియన్ బ్యాంక్	(ఆలమూరు)	08855	278440
డీసీసీబీ బ్యాంక్ (బ్రాంచి)	(ఆలమూరు)	08855	278591
బ్యాంక్ ఆఫ్ బరోడా	(పెదపళ్ల	08855	278583
యూనియన్ బ్యాంక్	(జొన్నాడ)	08855	279545
గోదావరి గ్రామీణ బ్యాంక్	(పెదపళ్ల)	08855	294703
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	(మడికి)	0883	2493272
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	(చెముడులంక)	0883	2493560
గోదావరి గ్రామీణ బ్యాంక్	(నర్శిపూడి)	0883	2493510
గోదావరి గ్రామీణ బ్యాంక్	(చొప్పెల్ల)	0883	2493113


ప్రమాద బాధితుడికి సాయం



బాలుడి తండ్రి దుర్గాప్రసాద్‌కు చెక్కు అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సంస్థ సభ్యులు

రావులపాలెం: ప్రమాదవశాత్తూ వేడి నీళ్లు పడటంతో శరీరం కాలిపోయిన బాలుడికి స్థానిక కాశీ అన్నపూర్ణ దేవి సేవా సంస్థ సభ్యులు రూ.12,500 చెక్కును ఆదివారం సాయంగా అందజేశారు. రాజమహేంద్రవరానికి చెందిన కుశాల్ కుమార్ అనే పదకొండు నెలల చిన్నారికి ఒంటి మీద వేడి నీళ్లు పడటంతో శరీరం అంతా కాలిపోయింది. ఆరు నెలల పాటు చికిత్స అందించాల్సిన పరిస్థితి ఉందని వైద్యులు తెలిపారు. అయితే ఆర్థిక స్తోమత లేకపోవడంతో కాశీ అన్నపూర్ణదేవి సేవా సంస్థ సభ్యులను చిన్నారి తండ్రి నూతి దుర్గాప్రసాద్ సాయం కోరారు. దీంతో రూ.12,500 చెక్కును బాధితుడి తండ్రికి సభ్యులు అందజేశారు.

కుట్టు మెషీన్ పంపిణీ



కుట్టు మెషీన్ అందజేస్తున్న సమతా పరిషత్ సభ్యులు

రావులపాలెం: స్థానిక సమతా పరిషత్ సభ్యులు ఆదివారం ఒక మహిళకు కుట్టుమెషీన్ అందజేశారు. ఏ ఆధారం లేకుండా నిరాశ్రయులైన కపిలేశ్వరపురం మండలం నేలటూరికి చెందిన చిట్టిశెట్టి రాధాచంద్ర కనకదుర్గ అనే మహిళకు పరిషత్ సభ్యులు కుట్టుమెషీన్‌ను అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు డాక్టర్ గోపాల్‌రెడ్డి, సిద్దాని తాతారావు, ఎస్‌వీఆర్ కృష్ణారెడ్డి, సుధాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.